ఉపాధి కల్పనకు సత్వర చర్యలు చేపట్టాలి

ఉపాధి కల్పించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలి

ఉపాధి కల్పనకు పూర్తిస్తాయి నివేదికను రూపొందించాలి

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

వాయిస్ టుడే, హనుమకొండ జిల్లా: పరకాల నియోజకవర్గ పరిధిలో యువతకు, మెగా టెక్స్ టైల్ పార్కు కోసం భూములిచ్చిన వారికి ఉపాధి కల్పించేందుకు అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో వివిధ శాఖల అధికారులతో పరకాల నియోజకవర్గ పరిధిలో మెగా జాబ్ మేళా, కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కులో సంగెం, గీసుకొండ తో పాటు ఇతర మండలాల స్థానికులకు ఉపాధి కల్పన, తదితర అంశాలపై సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ పరకాల నియోజకవర్గ పరిధిలో దరఖాస్తు చేసుకున్న వారితో పాటు టెక్స్ టైల్ పార్కు కోసం భూములు ఇచ్చిన వారి నుండి మొత్తం 3836మంది ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారికి వివిధ సంస్థలలో ఉపాధి కల్పనకు పూర్తిస్తాయి నివేదికను అధికారులు రూపొందించాలన్నారు. ఉపాధి కల్పనపై రెండు జిల్లాల కలెక్టర్లు, అధికారులు కృషి చేయాలన్నారు. వివిధ పరిశ్రమల్లో విడతల వారిగా ఉపాధిని కల్పించాలన్నారు. 18 నుండి 35 ఏళ్ల వయసు వారికి ముందుగా ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఆ తదుపరి మిగతా వయసుల వారికి ఉపాధి కల్పించేందుకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ వివిధ ఉపాధి అవకాశాలకు వచ్చిన దరఖాస్తులలో అర్హతలను ముందుగా పరిగణనలోకి తీసుకుని వారి జాబితాను సిద్ధం చేస్తే వివిధ సంస్థలలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మార్గం సుగమమౌతుందన్నారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ టెక్స్ టైల్ పార్కులో ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సెట్విన్ ఎండి మన్మోహన్, పరిశ్రమలు, ఉపాధి కల్పన, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వరంగల్ నిట్‌లో షార్ట్ టర్మ్ కోర్సు ప్రారంభం

వాయిస్ టుడే, కాజీపేట: ఈనెల సెప్టెంబర్ 23 నుండి 27 వరకు టీచింగ్ ఫర్ ఇన్‌క్లూజన్ ప్రిన్సిపల్స్ ఫర్ ఎఫెక్టివ్ ప్రాక్టీస్ అనే అంశం పై స్కీం ఫర్ ప్రమోషన్ అఫ్ అకాడమిక్ అండ్ రీసెర్చ్ కొలాబరేషన్ (స్పార్క్) ద్వారా స్పాన్సర్ చేయబడిన వారం రోజుల 'షార్ట్ టర్మ్ కోర్సు' నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, వరంగల్ (నిట్)లోని బోస్ హాల్ లో సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమ సమన్వయకర్తలలో ఒకరైన హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగంలో ప్రొఫెసర్ డాక్టర్ కె. మాధవి కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఐఐటి భువనేశ్వర్‌లోని డీన్, కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్ గౌరవ అతిథి ప్రొఫెసర్ వి. పాండురంగ ఇంక్లూసివ్ విద్య ఫిలాసఫీ, నిబద్ధత అనే వాస్తవాన్ని పునరుద్ఘాటించారు. అనంతరం నిట్ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యధర్ సుబుద్ధి ప్రసంగించారు. విద్యాసంస్థల్లో సమగ్రతను ఒక ప్రమాణంగా మార్చే ఇటువంటి కార్యక్రమాల పాత్రను డైరెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి ప్రొఫెసర్ స్టీఫెన్ హెూరులచేర్ (జర్మనీ) విద్యారంగంలో ఇన్‌క్లూజన్ (అవకాశాలు మరియు వనరులకు సమాన ప్రాప్తిని అందించే విధానం) తీసుకురావడంలో అన్ని స్థాయిలలో ఉపాధ్యాయుల ప్రాముఖ్యత గురించి ప్రసంగించారు.

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య

ముదిగొండ: భార్య కాపురానికి రావడంలేదన్న మనోవేదనతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన బాణాపురంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బాణాపురానికి చెందిన బాణాల శ్రీనివాస్(21) హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఏడాది క్రితం సూర్యాపేట జిల్లా బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన అమ్మాయిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావటంతో భార్య పుట్టింటికి వెళ్లింది. భార్య కోసం బరాఖత్‌గూడెం వెళ్లగా అక్కడ గొడవ జరిగింది. మనోవేదనకు గురైన శ్రీనివాస్ ఇంటిలోని వంటగదిలో దుప్పటితో సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి కృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో ఎవరూ లేని సమయంలో..

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: అంజుబాక గ్రామంలో ఓ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ నెల 18న ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబ సభ్యులు భద్రాచలం పట్టణంలోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. ఎస్సై గణేష్ 'న్యూస్‌టుడే'తో విషయం తమ దృష్టికి రాలేదని తెలిపారు.

యువత రాజకీయాల్లో ముందుండాలి

గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ముఖ్య లక్ష్యంగా ముందుగా ఉన్న యువకుడు

గ్రామ సర్పంచ్ బరిలో యువ నాయకుడు

నిర్మల్ జిల్లా వాయిస్ టుడే ప్రతినిధి,సెప్టెంబర్ 23: గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలు కానున్నది. ప్రతి గ్రామంలో నుండి పంచాయతీ బరిలోకి దిగేందుకు యువత ఆసక్తి చూపుతున్నది. పోటీ కోసం యువ నాయకత్వం రంగం సిద్ధం చేసుకుంటున్నది, గ్రామాల్లో ప్రజలతో మమేకమవుతు వారి సమస్యల పరిష్కరానికి యువ నాయకులు చొరవ చూపుతున్నారు. వివరాల్లో కెత్తే లోకేశ్వరం మండ లంలోని కనకపూర్ గ్రామానికి చెందిన ఈర్ల గణేష్ అనే యువ నాయకులు అవకాశం వస్తే సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలవడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొ న్నారు.ఈ సందర్భంగా ఈర్ల గణేష్ మాట్లాడుతూ గత పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ లుగా గెలిచిన అభ్యర్థులు గ్రామ అభివృద్ధికి కృషి చేయలేరని పేర్కొ న్నారు.గ్రామాన్ని తనవంతుగా యువ ప్రోత్సాహంతో అన్ని విధాలుగా అభి వృద్ధి చేసి గ్రామస్తుల సేవ కోసం ఎల్ల ప్పుడు రుణపడి ఉంటానని తెలి పారు.అన్ని వేళలా ప్రజలకు అందుబా టులో ఉంటూ ఆయా రంగాల వారి సమస్యలను పరిష్కరిస్తూ గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తానని ధీమా వ్యక్తం చేశారు.గ్రామ అభివృద్ధికై గ్రామస్తులు తనను ఆశీ ర్వదించి సర్పంచ్ పోటీకి మద్దతు తెలపాలని ఈర్ల గణేష్ కోరాడు. అన్నిరంగాలవారిసమస్యలనుపరిష్కరిస్తూ గ్రామా న్ని అభివృద్ధి బాటలో నడిపిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

ముత్తంగి రూపంలో రాములోరి దర్శనం

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారు సోమవారం ముత్తంగి రూపంలో దర్శనమిచ్చారు. ముత్యాలతో పొదిగిన వస్త్రాలంకృతుడైన రామయ్యతండ్రి చూడముచ్చటగా కనిపించారు. అర్చకులు భక్తిశ్రద్ధలతో సుప్రభాతం పలికి ఆరాధించి నామార్చన చేశారు. క్షేత్ర విశిష్టతను ప్రవచించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించి కంకణధారణ కొనసాగించారు. సీతమ్మకు యోక్త్రధారణ, రామయ్యకు యజ్ఞోపవీతధారణ కనులపండువగా సాగింది. మాంగల్యధారణ, తలంబ్రాల వేడుక ఆధ్యాత్మికతను పెంచగా దర్బారు సేవలో ఆలపించిన కీర్తనలు తన్మయత్వాన్ని చాటాయి.

రోడ్డు ప్రమాద పారిశుద్ధ్య కార్మికురాలికి అండగా ఎంపీ

రెండు కాళ్లు విరిగిపోయిన పారిశుధ్య కార్మికురాలికి పరామర్శ

పూర్తిగా కోలుకునే వరకు మెరుగైన చికిత్స అందించాలని ఆదేశం

ప్రజారోగ్య విభాగం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎంపీ కావ్య

ఎంజిఎం ఆసుపత్రిలో మందులపై ఆరా..

వాయిస్ టుడే, వరంగల్ జిల్లా: ఇటీవల హన్మకొండ ఎన్జీవోస్ కాలనీలో విధుల్లో భాగంగా రోడ్లు శుభ్రం చేస్తున్న బల్దియా పారిశుద్ధ్య కార్మికురాలు రామంచ సమ్మక్క కారు ఢీకొని తన రెండు కాళ్లు విరిగిపోయి దీనస్థితిలో వరంగల్ ఎంజిఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నదని తెలుసుకున్న వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సోమవారం ఎంజీఎం ఆస్పత్రికి చేరుకొని ఆమెను పరామర్శించారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితిని, అందిస్తున్న చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. స్వయంగా వరంగల్ ఎంపీ వైద్యురాలు కావడంతో ఎంపీ కడియం కావ్య పేషెంట్ రిపోర్టులను పరిశీలించారు.

తను పూర్తిగా కోలకునే వరకు మెరుగైన వైద్య చికిత్స అందించాలంటూ ఆసుపత్రి అధికారులను ఆదేశించారు.

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆసుపత్రికి చేరుకుంటున్న సమాచారం తెలుసుకుని అక్కడికి చేరుకున్న ప్రజా ఆరోగ్య విభాగ అధికారులపై ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు వారాలు గడుస్తున్నా పేషెంట్ కనీస పరిస్థితిని పట్టించుకోకుండా ఉన్న సిబ్బంది పై మండిపడ్డారు. చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డా. రాజేష్ తో మాట్లాడిన ఎంపీ డా.కడియం బాధితురాలికి అందాల్సిన బెనిఫిట్స్ ను సకాలంలో అందేలా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య బాధితురాలికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం పలువురి పేషెంట్లను పరామర్శించిన ఎంపీ గతంలో నిర్వహించిన ఫార్మసీ తనిఖీల తరువాత ఎలాంటి మార్పులు చేశారనే విషయం పై ఆరా తీశారు. ప్రస్తుతం మందులు అందుబాటులో ఉన్నాయా లేదా విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఇతర మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య అవసరమైన మంజూరుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

కలెక్టరేట్‌లో స్పందనకి అనూహ్య స్పందన

రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 23 (వాయిస్ టుడే ప్రతినిధి) జిల్లా కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పెద్ద ఎత్తున ప్రజలు అర్జీలను సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ,జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు, జిల్లా రెవెన్యూ అధికారి జి నరసింహులు, దిశా డిస్పి వి. వెంకటేశ్వర్లు, ఆర్ డి టూరిజం వి. స్వామి నాయుడు, డ్వామా పీడీ ఆర్ శ్రీరాములు నాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు. సుమారు 450 కి పైగా అర్జీలను ప్రజల నుంచి అధికారులు స్వీకరించినట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం అర్జీలను ఇచ్చేవారు స్థానిక డివిజన్, మండల స్థాయి అధికారులకు సంబంధిత అర్జి లను అందజేయాలని పేర్కొన్నారు. ప్రజల నుంచి స్వీకరించి అర్జిలను ఆన్లైన్లో సమోదు చేయడం ద్వారా పారదర్శకంగా, జవాబుదారీ తనం తో పరిష్కారం చేస్తామన్నారు. విజన్ 2047 నేపథ్యంలో ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరిస్తామన్నారు.

"టెక్నో విస్తా" కార్యక్రమం విద్యార్థులకు వేదిక

వాయిస్ టుడే, హనుమకొండ: ఇంజనీరింగ్ విభాగంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెంపోదించడంలో "టెక్నో విస్తా" కార్యక్రమం విద్యార్థులకు మంచి వేదిక అని వరంగల్ పశ్చిమనియోజకవర్గ ఎమ్మెల్యే అభివర్ణించారు. సోమవారం హనుమకొండ నగరంలోని చైతన్య డిగ్రీ కాలేజీ (సిడిసి)లో నిర్వహిస్తున్న "టెక్నో విస్తా" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువుతో పాటు సాంకేతిక పరిజ్ఞానంలో ప్రతి ఒక్కరు రాణించాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మీరు కూడా అన్ని రంగాల్లో ప్రతిభను చూపిస్తూ దేశ భవిష్యత్తులో ఉపయోగపడేలా చూడాలని కోరారు. సాంకేతిక పరమైన ఇలాంటి కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నానని, కళాశాల యాజమాన్యానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రత్యేక అభినందలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి వినతులను వెంటనే పరిష్కరించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

వాయిస్ టుడే, హనుమకొండ జిల్లా: ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు వివిధ సమస్యలపై అందించిన వినతులను వెంటనే పరిష్కరించే విధంగా సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజావాణి కార్యక్రమాన్ని వివిధ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు వివిధ సమస్యలపై వినతి పత్రాలను జిల్లా కలెక్టర్ కు అందజేశారు. ప్రజల నుండి వినతి పత్రాలను స్వీకరించిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఆయా శాఖల ఉన్నతాధికారులు ప్రజావాణిలో వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించే విధంగా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి 139 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో డీఆర్వో వై. వి. గణేష్, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డాక్టర్ కె. నారాయణ, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

వాయిస్ టుడే, కాజీపేట: పట్టణంలోని 47వ డివిజన్ డిజిల్ కాలనీకి చెందిన మహమూద్ అంజద్ బ్రెయిన్ స్ట్రోక్ తో, బాపూజీ నగర్ కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు మహమ్మద్ భాష తల్లి అష్టల్ బేగం అనారోగ్యం తో మరణించగా వారి భౌతికకాయాలకు 47వ డివిజన్ కాంటెస్ట్ కార్పొరేటర్ సందెల విజయ్ కుమార్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇమ్మడి బాబు, వంశీ, రబ్బాని, చింటూ, వెంకటేశ్వర్లు, రవి, ప్రవీణ్, ముస్లిం సోదరులు ఉన్నారు.